సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 2 । జూన్ । 2023



అనుమానంతోనే చంపేశాడు

నూజివీడు పట్టణంలో హత్యకు గురైన హైమావతిని అనుమానంతోనే నిందితుడు కోటయ్య హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. 8లో ▸



వాగులో కారు బోల్తా

బంధువులు పెళ్లికి హాజరయ్యేందుకు వెళ్తూ కారు బైనేరు వాగులో పడిపోవడంతో జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ వ్యాపారి మృతి చెందాడు. 8లో ▸



మీనం.. ధర పతనం

సాగులో పెట్టుబడి పెరిగి.. చేప ధర తగ్గడంతో ఆక్వా రైతు ఆందోళన చెందుతున్నాడు. కిలోకు రూ.8 వరకు మేత రేటు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదంటున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మొదటి రోజు 83 శాతం పెన్షన్లు అందజేత



భీమవరం ఇంపీరియల్ ఆస్పత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీరు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ పెన్షన్ కానుక జిల్లాలో మొదటి రోజు 83 శాతం మేర పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పెన్షన్ లబ్ధిదారులు 2.17 లక్షల మంది ఉండగా రూ.59.22 కోట్లు చెల్లించాలి. మొదటి రోజు గురువారం 1.81 లక్షల మంది లబ్ధిదారులకు రూ.47.82 కోట్ల మేర పంపిణీ చేశారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులు వివిధ క్రీడలలో ప్రావీణ్యం పొందాలని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. భీమవరంలోని కలెక్టరు చాంబర్‌లో వేసవి శిక్షణ శిబిరాలకు అవసరమైన రూ.2.75 లక్షల విలువైన క్రీడా సామగ్రిని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు గురువారం అందజేశారు. జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 50 ప్రాంతాల్లో మే 1 నుంచి జూన్ 10 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో శిబిరానికి రూ.5,500 విలువైన క్రీడా సామగ్రిని గురువారం కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ వివిధ క్రీడాంశాల్లో ఇచ్చే వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీరామ్ రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శివ, జీవీఎస్ శేఖర్ రాజు, రాజేంద్ర రామభద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మే 24 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. గురువారం పశ్చిమ గోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన ఒక కేంద్రంలో జాగ్రఫీ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం జాగ్రఫీ పరీక్షకు ఒక విద్యార్థి పరీక్ష రాయాల్సి ఉండగా గైర్హాజరయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, శనివారం ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

దేవదాయ శాఖ అధికారిగా ఈవీ సుబ్బారావు



ఈవీ సుబ్బారావు

భీమవరం(ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా దేవదాయ శాఖ అధికారిగా ఈవీ సుబ్బారావు నియమితులయ్యారు. కాకినాడ నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఇంత వరకూ ఇన్‌చార్జి డీఈఓగా పనిచేసిన వై.భద్రాజి అదనపు బాధ్యతల నుంచి వైదొలిగారు. భీమవరం బీజే సత్రం వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న రుద్రరాజు గంగా శ్రీదేవి సత్తా రామేశ్వరం దేవస్థానం ఈవోగా బదిలీయ్యారు. మదన గోపాల దేవస్థానం బల్లిపాడు ఈఓ సీఎస్ దొరబాబు నాళం వారి సత్రం రాజమహేంద్రవరానికి బదిలీయ్యారు. పంచారామ క్షేత్రం ఈఓ చాగంటి సురేష్ నాయుడు రెగ్యులర్ అయ్యారు. కాళ్లకూరు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్‌కుమార్ కూడా రెగ్యులర్ అయ్యారు. మండపాక గ్రూపు దేవాలయాల ఈఓ ఎం.వీ రామయ్య తూర్పుగోదావరి జిల్లా పెరవలికి బదిలీఅయ్యారు.

నేడు వడగాల్పులు

భీమవరం(ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వడగాల్పులు వీచే అవకాశముందని, ఉష్ణోగ్రత 45 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు.

ఐటీఐలు.. ఉపాధి కేంద్రాలు

- ఏలూరు జిల్లాలో 19 ఐటీఐ, పశ్చిమలో 18 ఐటీఐ కళాశాలలు
- ఐటీఐ అప్రెంటిస్‌కు ఎంపికైతే విద్యార్థి ఖాతాలో రూ.9550 జమ
- ప్రతిభ చూపితే 18 ఏళ్లలోపే ఉద్యోగాలు



ఏలూరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ



ఐటీఐలో వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉన్నత విద్య చదివే అవకాశం లేకపోవడమో.. కుటుంబ బాధ్యతల వల్లో చాలా మంది పదో తరగతి, ఇంటర్‌తో చదువు ఆపేస్తుంటారు. వారికి ఉద్యోగం చేయాలని ఉన్నా వారి చదువుకు సరైన ఉద్యోగాలు లేక ఆర్థికంగా ఇబ్బందిపడుతుంటారు. అలాంటి వారికి వరం ఐటీఐలు.. ఐటీఐ పూర్తి చేసి కేవలం 18 ఏళ్ళ వయసులో కూడా మంచి ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న ప్రజావసరాల కోసం దేశంలో భారీగా పరిశ్రమలు నెలకొల్పుతూనే ఉన్నారు. ఆయా పరిశ్రమల్లో పని చేయడానికి పారిశ్రామిక శిక్షణ పొందిన వారు అత్యధిక సంఖ్యలో అవసరం. ఈ మేరకు ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తి చేసిన వారికి సులభంగా, త్వరితగతిన ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.

ఐటీఐల్లో అందుబాటులో ఉండే కోర్సులు

ఐటీఐ కళాశాలల్లో పరిశ్రమలకు అవసరమైన వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వాటిలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనింగ్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోపా వంటి కోర్సులకు పరిశ్రమల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆయా కోర్సులు పూర్తి చేసి వాటిలో ప్రావీణ్యం చూపితే.. యువతకు వెంటనే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. రెండేళ్ళ కాలపరిమితితో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేస్తే గ్రామ సచివాలయం, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది.

నిత్యనూతనం ఫిట్టర్ కోర్సు..

ఐటీఐలో ఫిట్టర్ కోర్సు నిత్యనూతనంగా ఉంటుంది. ఈ కోర్సుకు విద్యార్థుల్లో మంచి డిమాండ్ ఉంది. ఐటీఐ కళాశాలల్లో తొలుత సీట్లన్నీ భర్తీ అయ్యేది ఈ కోర్సులోనే. రెండేళ్ళ కోర్సు పూర్తి చేస్తే అటు ప్రైవేట్ పరిశ్రమలతో పాటు ప్రభుత్వరంగ సంస్థల్లో కూడా మంచి ఉద్యోగాలు వస్తాయి. డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ కోర్సు రెండేళ్ళు.. నిర్మాణ రంగంలో ఈ కోర్సు చేసిన వారికి అవకాశాలు ఎక్కువ. గ్రామ, వార్డు సచివాలయల్లో భర్తీ చేసే సర్వేయర్ పోస్టులకు ఈ కోర్సు చేసిన వారు అర్హత పొందుతారు. మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సు రెండేళ్ళు చేయాలి. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రైల్వే, ఆర్టీసీలతో పాటు వివిధ మోటార్ సైకిల్, కార్ల తయారీ సంస్థల్లో ఉద్యోగావకాశాలతో పాటు సొంతంగా మోటారు వాహనాల సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఎలక్ట్రానిక్స్ మెకానిక్ కోర్సు చేసిన వారికి టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు వంటి ఉత్పత్తి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

అప్రెంటిస్‌కు ఎంపికైతే ఖాతాలోకి రూ. 9550

ఐటీఐ పూర్తి చేసి అప్రెంటీస్‌గా ఎంపికై తే అతని ఖాతాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా రూ.9550 జమ చేస్తాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.8050, కేంద్ర ప్రభుత్వం రూ.1500 జమ చేస్తాయి. ఆయా కోర్సులతో పాటు ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు వెళ్లాలన్నా డిప్లమో అర్హత పొందేందుకు బ్రిడ్జి కోర్సు అందుబాటులో ఉంటుంది. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థి నేరుగా డిప్లామా 2వ సంవత్సరం చదవడానికి అర్హత పొందుతాడు. వీటితో పాటు కోపా అనే కోర్సు కేవలం 10వ తరగతి విద్యార్హతతో చేయవచ్చు.

ఈ కోర్సు చేసిన వారికి కంప్యూటర్ ఆపరేటర్లుగా, హార్డ్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. లభిస్తున్నాయి. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు కూడా ఏడాది మాత్రమే చదివే వెల్డర్ కోర్సులో చేరవచ్చు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రైల్వేతో పాటు ఓఎన్‌జీసీ, ఆర్టీసీల్లో, పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఉమ్మడి జిల్లాలో 37 ఐటీఐ కళాశాలలు

ఐటీఐలో చేరి వివిధ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 37 కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు 5 ఉండగా వివిధ ట్రేడుల్లో 828 సీట్లు, 14 ప్రైవేట్ ఐటీఐలు ఉండగా వాటిలో 1712 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 308 సీట్లు, 16 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2976 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

వెల్డర్ గ్రూపుతో రూ.25 వేల జీతం



మాది చాగల్లు మండలం ఊనగట్ల.. ఏలూరు ఐటీఐలో వెల్డర్ ట్రేడ్ పూర్తి చేశాను. ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగపడింది. చిన్న వయసులోనే ఉద్యోగం సాధించగలిగాను. ప్రస్తుతం అల్‌స్టోమ్ అనే సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. నెలకు రూ. 25 వేలు జీతం లభిస్తోంది.

– కే.సురేష్, ఐటీఐ విద్యార్థి

ఈసీఐఎల్‌లో ఉద్యోగం



ఏలూరు ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్ పూర్తి చేశాను. అనంతరం డీఆర్‌డీఓలో అప్రెంటిస్‌షిప్ అవకాశం లభించింది. అది పూర్తయిన వెంటనే ఈసీఐఎల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో ఉద్యోగం లభించింది. 2021లో ఉద్యోగంలో చేరాను. రూ. 20 వేల జీతం వస్తోంది. ఇంజనీరింగ్‌లో మాత్రమే కాదు ఐటీఐతో కూడా పెద్ద సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయనడానికి నేనే ఉదాహరణ.

– ఎస్‌పి శంకర్, ఐటీఐ విద్యార్థి

6 వరకూ దరఖాస్తుకు అవకాశం



ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ప్రభుత్వం ఈ నెల 6 వరకూ గడువు ఇచ్చింది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ లింకులో తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సుల్లో ప్రవేశించిన వారికి శిక్షణ కాలంలో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు అర్హులవుతారు.

– పీ రజిత, ఏలూరు పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి

కారుమూరిని కలిసిన అపుస్మా నాయకులు



తణుకులో మంత్రి కారుమూరిని కలిసి వినతిపత్రం అందిస్తున్న అపుస్మా నాయకులు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును పశ్చిమగోదావరి జిల్లా ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల డైరెక్టర్స్ గురువారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి కారుమూరికి వినతిపత్రం అందచేశారు. గత 4 సంవత్సరాల పాఠశాలల ఆడిట్ రిపోర్ట్స్, అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్స్, వివిధ ధ్రువపత్రాలు డీఈవో కార్యాలయంలో అందచేయాల్సిందిగా జిల్లా కలెక్టరు ఆదేశించారని ఇందుకు 2 నెలలు సమయం ఇప్పించాల్సిందిగా కోరారు. స్పందించిన మంత్రి కారుమూరి వెంటనే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టరుతో ఫోన్‌లో మాట్లాడి వారు కోరినట్లుగా గడువు ఇప్పించమని కోరారు. ఈ సందర్భంగా అపుస్మా రీజనల్ డైరెక్టర్ జంగా బాలాజీ మాట్లాడుతూ మంత్రి కారుమూరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అత్తింటి సుబ్బరాజు, జిల్లా కోశాధికారి కొమ్ముల రామకృష్ణ, రాష్ట్ర ఈసీ సభ్యులు బి.విద్యాకాంత్, తణుకు జోన్ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాఠశాలల డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ఆలయాల్లో బదిలీ జాతర

ద్వారకాతిరుమల: రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో బదిలీల జాతర జరిగింది. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులను రాష్ట్రంలోని పలు క్షేత్రాలకు బదిలీ చేశారు. జె.గోపీనాథ్ (సూపరింటెండెంట్)ను సింహాచలం క్షేత్రం నుంచి ఇక్కడకు డిప్యూటేషన్‌పై బదిలీ చేయగా, ఇక్కడ నుంచి కేవీ నరసింహారావు (సీనియర్ అసిస్టెంట్), కె.హరిశ్చంద్రప్రసాద్, ఎ.చిట్టిబాబు (జూనియర్ అసిస్టెంట్)ను సింహాచలం క్షేత్రానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అలాగే కె.సతీష్ (సూపరింటెండెంట్) అన్నవరం నుంచి ఇక్కడకు రాగా, వి.గిరిజారాణి (సూపరింటెండెంట్) ఇక్కడ నుంచి అన్నవరం బదిలీ అయ్యారు. అలాగే సీనియర్ అసిస్టెంట్లు కాశీభట్ల రాంబాబు, జె.కామేశ్వరి ఇక్కడకు రాగా, జూనియర్ అసిస్టెంట్లు బి.పవన్‌కుమార్ అన్నవరం బదిలీ అయ్యారు.

రైతు సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

కలెక్టర్ ప్రశాంతి



భీమవరంలో వైఎస్సార్ రైతు భరోసా నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో రైతులకు రైతు భరోసా నిధులు జమ చేసిన సందర్భంగా భీమవరం విష్ణు కళాశాల సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. రైతులకు సాగుపెట్టుబడి సహాయంగా అందిస్తున్న మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేసినపుడు లబ్ధిదారుల జాబితాలో తమ పేరు ఉందో లేదో అని ఆందోళన పడేవారని, నేడు ఆ పరిస్థితి లేదని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రైతులందరికీ సాగుకు పెట్టుబడి సహాయంగా ఏటా రూ.13,500 నాలుగు సంవత్సరాలుగా జమ చేసినట్లు చెప్పారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు మొదటి విడతగా రూ.7,500 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నట్లు చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ఈ క్రాప్ బుకింగ్, బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాలతోపాటు వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా రైతులకు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సుమారు 1.18 లక్షల మంది రైతులకు రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా 5వ ఏడాది మొదటి విడత రూ.88.58 కోట్లు నమూనా చెక్‌ను, రబీలో పంట నష్టపోయిన 304 మంది రైతులకు రూ. 23.54 లక్షల నమూనా చెక్‌ను అందచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు, సభ్యుడు కొట్టి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.


3న జెడ్పీ స్థాయి కమిటీ సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఈ నెల 3న జిల్లా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు ఆర్థికస్థాయి కమిటీ, 10.30 నుంచి 11.00 వరకు గ్రామీణ అభివృద్ధి స్థాయి కమిటీ, 11.00 నుంచి 11.30 వరకు వ్యవసాయ స్థాయి కమిటీ, 11.30 నుంచి 12.00 వరకు విద్యవైద్యసేవల స్థాయి కమిటీ, మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 వరకు మహిళా సంక్షేమస్థాయి కమిటీ, 12.30 నుంచి 1.00 సాంఘిక సంక్షేమస్థాయి కమిటీ, 1.00 నుంచి 1.30 వరకు పనుల స్థాయి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ చెప్పారు.

నవరత్నాలు.. నవశకానికి మైలురాళ్లు

- జిల్లాలో రూ.7,732.31 కోట్ల లబ్ధి
- ఏలూరు జిల్లాలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- పథకాల్లో సింహభాగం మహిళలకే

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రతి మహిళ మోములో చిరునవ్వు తెస్తాం.. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించి ఆర్థికంగా ముందడుగు వేసేలా బాధ్యత తీసుకుంటానని పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా నవరత్నాలతో కూడిన సంక్షేమ పాలన కొనసాగుతోంది. నవరత్న పథకాలను ప్రకటించి ప్రతిఏటా ఠంఛన్‌గా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో గత నాలుగేళ్లలో ప్రజలకు నవరత్నాల ద్వారా అందింది అక్షరాలా రూ.7,732.31 కోట్లు.. ఏలూరు జిల్లాలో 87,122 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వీటి విలువ వేల కోట్లలో ఉంటుంది. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల జనరంజక పాలనలో జిల్లాకు అందిన లబ్ధి. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోని ప్రకటించింది. మేనిఫెస్టోలో నవరత్న పథకాలు ప్రకటించి సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి ఎన్ని కష్టనష్టాలు వచ్చినా నిర్ణీత తేదిల్లో లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తున్నారు. నవరత్నాల పథకాలతో పాటు కాపు నేస్తం, 40 ఏళ్ళ పైబడిన బీసీ మహిళలకు ఆర్థిక సాయం, న్యాయవాదులకు, చేతి, కులవృత్తిదారులకు ఇలా అనేక సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో నేరుగా వారి ఖాతాకే నగదు జమ చేస్తున్నారు. ఇవన్నీ కాకుండా కేవలం నవరత్నాల్లోని సంక్షేమ పథకాల ద్వారానే ఏలూరు జిల్లాలో రూ.7732.31 కోట్లు ప్రజలకు నేరుగా జమ చేశారు. గత ఏ ప్రభుత్వాలు ఈ స్థాయిలో ఆర్థిక చేయూత అందించిన దాఖలాలు లేవు. ఒకవైపు జిల్లాలో మౌలిక వసతులతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, వైద్యకళాశాలలు, ఆక్వా యూనివర్సిటీ, వాటర్ గ్రిడ్ లాంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. వీటన్నింటికి ధీటుగా నవరత్నాల ద్వారా వేల కోట్ల లబ్ధి జరుగుతుంది. కరోనా లాంటి కష్టకాలంలో కూడా నిరంతరంగా సంక్షేమ పథకాలు కొనసాగించారు.



అర్హులందరికీ ఫలాలు



అర్హతుంటే తప్పకుండా పథకాలు అందాలని సీఎం చెబుతున్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నాం. స్పందన, జగనన్నకు చెబుదాం ద్వారా ఫిర్యాదులు పరిష్కరిస్తున్నాం.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు

నవరత్నాలు ఇలా..

వైఎస్సార్ రైతుభరోసా

2019–20 సంవత్సరంలో 2,31,061 మంది లబ్ధిదారులకు రూ.311.93 కోట్లు, 2020–21లో రూ.297.73 కోట్లు, 2021–22లో రూ. 265.67 కోట్లు, 2022–23లో రూ.262.11 కోట్లు మొత్తంగా ఇంతవరకు రూ.1137.34 కోట్లు అందించారు.

జగనన్న విద్యాదీవెన

విద్యార్థుల తల్లుల ఖాతాలకు 2019–20లో 36,527 మంది విద్యార్థులకు రూ. 95.78 కోట్లు, 2020–21లో రూ.77.97 కోట్లు, 2021–22లో రూ.105.67 కోట్లు, 2022–23లో రూ.56.16 కోట్లు జమ చేశారు. మొత్తం రూ. 335.58 కోట్లు జమ చేశారు.

అమ్మఒడి

ఈ పథకంలో తల్లుల ఖాతాలకు భారీగా నగదు జమైంది. 2019–20లో 1,80,327 మంది మహిళల ఖాతాల్లో రూ.270.49 కోట్లు, 2020–21లో 266.16 కోట్లు, 2021–22లో 276.36 కోట్లు మొత్తంగా ఇప్పటి వరకు 813.01 కోట్లు అందించారు. ఈ ఏడాది పంపిణీ చేయాల్సి ఉంది.

జగనన్న కాలనీలు

జగనన్న లేఅవుట్ల ద్వారా భారీగా ప్రజలకు మేలు జరిగింది. ఏలూరు జిల్లాలో 1,02,171 ఇళ్ళ పట్టాలు మంజూరు చేశారు. ఒక్కో ఇంటి పట్టా విలువ లక్షల్లో ఉంటుంది. ఇంత వరకు 585.09 కోట్లు ఇళ్ళ నిర్మాణానికి మెగా కాలనీల్లో ఖర్చు చేశారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

2019–20లో 14,545 మందికి రూ. 35.01 కోట్లు, 2020–21లో రూ.38.22 కోట్లు, 2021–22లో రూ. 52.89 కోట్లు, 2022–23లో 80.15 కోట్లు మొత్తం రూ. 206.27 కోట్లు ప్రజల వైద్యం కోసం ఖర్చు చేశారు.

వైఎస్సార్ చేయూత

2020–21లో 94,670 మంది మహిళలకు రూ. 177.51 కోట్లు, 2021–22లో రూ.165.60 కోట్లు, 2022–23లో రూ.218.42 కోట్లు మొత్తంగా రూ.561.53 కోట్లు మహిళల బ్యాంకుల ఖాతాలో జమ చేశారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక

ప్రతి నెల 1వ తేదిన ఉదయం 6 గంటలకే వలంటీర్ల ద్వారా నేరుగా పెన్షన్‌దారులకు నగదు అందిస్తున్నారు. 2019–20లో 2,47,215 మందికి రూ.713.14 కోట్లు, 2020–21లో రూ.745.25 కోట్లు, 2021–22లో రూ.785.44 కోట్లు, 2022–23లో రూ.813.62 కోట్లు ఇంతవరకు అందజేశారు. అత్యధికంగా రూ.3057.45 కోట్లు పెన్షన్లుగా అందించారు.

వైఎస్సార్ ఆసరా

మూడు విడతల్లో రూ.985.82 కోట్లు జమ చేశారు. 3,55,315 మంది మహిళల ఖాతాల్లో 2020–21లో రూ. 327.56 కోట్లు, 2021–22లో రూ.329.92 కోట్లు, 2022–23లో రూ.328.34 కోట్లు ఇప్పటి వరకు జమైంది.

వైఎస్సార్ జలకళ పథకం

2020–21లో రూ.8.67 కోట్లు, 2021–22లో రూ.31.51 కోట్లు, 2022–23లో రూ.10.04 కోట్లు మొత్తంగా 50.22 కోట్లు అందించారు.

క్లుప్తంగా

వాసవీ హుండీ ఆదాయం రూ.4.53 లక్షలు



హుండీ లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం హుండీ లెక్కించగా 72 రోజులకు రూ.4,53,370 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి జీఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ చెప్పారు. మార్టేరు వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో కర్రి బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో భక్తులు హుండీ లెక్కించినట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావు, ఆలయ ప్రధాన అర్చకులు కోట వెంకట సుబ్రహ్మణ్యం, చలుమూరి అప్పారావు, లింగోలు భాస్కరరావు, తాతోలు వరలక్ష్మీ, నిమ్మల సరోజని, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన వరాల వెంకన్న



సింహ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

అత్తిలి: ఈడూరులో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం కావు పైడిరాజు, నాగలక్ష్మి, పెరికెల మురళీ, చక్రధరణి దంపతులతో శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాల సేవ జరిపారు. సాయంత్రం వేదపారాయణం, పండిత సత్కారం నిర్వహించారు. సాయంత్రం మంతెన వెంకట సత్య సూర్య సీతారామరాజు, వెంకట సుబ్బమ్మ దంపతులు సమర్పించిన సింహవాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి సింహవాహన సేవ వైభవంగా జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

మీనం.. ధర పతనం

- పెరుగుతున్న పెట్టుబడి.. తగ్గిన చేప ధర
- కిలోకు రూ.8 వరకు పెరిగిన మేత రేటు
- నష్టాలతో ఆక్వా రైతుల్లో ఆందోళన



భీమవరం మండలంలో చేపలు పడుతున్న దృశ్యం



పట్టుబడి పట్టిన చేపలను ట్రేల్లో నింపుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రభుత్వానికి డాలర్ల పంట పండించే రొయ్యల రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు చేపల సాగు ఆదుకునేది. ప్రస్తుతం చేపల ధరలు తగ్గి మేత ధరలు ఒక్కసారిగా పెరగడంతో ఆక్వా రైతులు కలవరపడుతున్నారు. చేపలను దిగుమతి చేసుకునే దేశాల్లో చేపల ఉత్పత్తి పెరగడం, ఇక్కడ నుంచి ఎగుమతి అయ్యే చేపలు వాసన వస్తున్నాయంటూ దిగుమతులపై ఆంక్షలు విధించడంతో గత నెల రోజులుగా చేపల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాలో ఆక్వా సాగు చేస్తుండగా, దీనిలో దాదాపు 1.70 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. జిల్లాలో కార్పొరేట్ ఫిష్ కల్చర్ ప్రారంభం కావడంతో భూములను లీజుకు తీసుకుని చేపల సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపల సాగులో ఎకరాకు ఏడాదికి సుమారు 4 టన్నుల వరకు చేపల దిగుబడి వస్తుండగా ఇక్కడి చేపలను అస్సాం, పశ్చిమబెంగాల్, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రతి రోజు 200 లారీల చేపలు ఎగుమతి అవుతుంటాయి.

డీఓబీ కిలో ధర రూ.19 నుంచి 23కు పెంపు

జిల్లాలో రైతులు ఎక్కువగా శీలావతి, కట్ల, ఫంగస్ రకం చేపలను సాగుచేస్తుంటారు. చేపల పెంపకానికి ఎక్కువగా వినియోగించే డీఓబీ, సోయాబీన్, వేరుశెనగ చెక్క ధరలకు ఒక్కసారిగా పెరిగిపోయాయని రైతులు చెబుతున్నారు. డీఓబీ గతంలో కిలో ధర రూ.14 ఉండగా ప్రస్తుతం రూ.19 నుంచి రూ.23 వరకు పెరిగింది. అలాగే వేరుశెనగచెక్క కిలో గతంలో రూ.35 ఉండగా ప్రస్తుతం రూ.43 పెరిగింది. ఇది ఇలా ఉండగా చేపల ధరలు మాత్రం పెరగక పోక పోగా మరింత తగ్గాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఫంగస్ చేప కిలో రూ.80 వరకు విక్రయాలు చేయగా, ప్రస్తుతం రూ.74, శీలావతి, కట్ల రకం చేపలు కిలో రూ.100 మాత్రమే ధర పలుకుతున్నాయని చెబుతున్నారు. చేపల సాగుతో లాభాల సంగతి అటుంచి నష్టాలను చవిచూడాల్సివస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రొయ్యల ధరలు తగ్గితే చెరువుల్లో చేపలు పెంచి ఎంతో కొంత నష్టాలను అధిగమించేవారమని, ప్రస్తుతం చేపల సాగు అంటేనే భయపడాల్సి వస్తోందని చెబుతున్నారు. ఆక్వా సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తున్నా ధర లేకపోవడం, మేత ధరలు పెరగడంతో నష్టాలను అధిగమించలేకపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇటీవల అస్సాం వంటి రాష్ట్రాల్లో ఐస్ కొరత కారణంగా నిల్వ ఉంచే చేపలు వాసన రావడంతో దాని ప్రభావం మనపై పడి దిగుమతులు నిలిచిపోయినా దీనిపై విచారణ చేసిన తరువాత దిగుమతులు యథావిధిగా కొనసాగుతున్నాయని చెబుతున్నారు.

రూ.100 పైబడి ఉంటేనే ధర గిట్టుబాటు



ఆక్వా సాగుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత నిచ్చి అండగా ఉన్నప్పటికీ చేపల ధరలు తగ్గిపోవడం, మేత ధరలు పెరగడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. చేపల ధర కిలో రూ.100 పైబడి ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుంది.

– పేరిచర్ల విజయనర్సింహరాజు, చేపల రైతు, పెదగరువు, భీమవరం మండలం

నష్టాలను చవిచూస్తున్నాం



ఇటీవల చేపల ధరలు తగ్గడంతో నష్టాలను చవిచూడాల్సివస్తున్నది. దీనికితోడు చేపల మేత ధరలు పెరగడంతో రైతులకు గోరుచుట్టుపై రోకలి పోటులా పరిణమించింది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీ ఇస్తే రైతులకు కొంత ప్రయోజనకరంగా ఉంటుంది.

– శాయన సువర్ణ, చేపల రైతు, ఆకివీడు

గంగానమ్మకు హోం శాఖ మంత్రి వనిత పూజలు



పొంగుటూరు గంగానమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి వనిత

కొయ్యలగూడెం: మతాలకు అతీతంగా పొంగుటూరు గ్రామ దేవత శ్రీగంగానమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. పొంగుటూరు గ్రామ దేవత శ్రీగంగానమ్మ అమ్మవారి జాతర నేపథ్యంలో గురువారం ఆలయానికి విచ్చేసిన మంత్రి అమ్మవారిని దర్శించుకుని అర్చకులు మామిళ్లపల్లి సీతారాం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసుపులేటి రాంబాబు జాతర నిర్వాహకుల ఆధ్వర్యంలో తొలుత మంత్రి వనితకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయ చరిత్రను పెద్దల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు జాతర శుభాకాంక్షలు తెలిపి శాంతిభద్రతలతో జాతర ఉత్సవాలు నిర్వహించుకోవాల్సిందిగా సూచించారు. మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కాసగాని గోఖలే, ఏఎంసీ డైరెక్టర్ కొల్లూరు సత్తిబాబు, మాజీ సర్పంచ్ టి.రాజు, గేలం శ్రీను, ఎంపీటీసీ సభ్యులు నేలుపోలు దుర్గారావు, గేలం వెంకటేశ్వరరావు, పసుపులేటి రవీంద్ర, కై కవరపు గోపి, దూలపల్లి కాంతారావు, తమ్మిర్చి బ్రహ్మన్న పాల్గొన్నారు.

పంటబోదెలో ఆడ శిశువు మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని నరసాపురం రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ వెనుక పంటబోదెలో నెలల వయస్సు ఉన్న ఆడశిశువు మృతదేహం లభ్యమైంది. గురువారం స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పంటబోదెలో నీరు తక్కువగా ఉండడంతో శిశువు ఎక్కడి నుంచో కొట్టుకువచ్చే అవకాశం లేదని, స్థానికంగానే ఎవరో కాలువలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శిశువు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానంతోనే చంపేశాడు

- హైమావతి హత్య కేసులో తేల్చిన పోలీసులు
- 24 గంటల్లో నిందితుడి అరెస్టు



మహిళ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్

నూజివీడు: పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో పిడపర్తి హైమావతి హత్య కేసులో నిందితుడైన గరికే కోటయ్యను 24 గంటల్లో పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి అరెస్టు చేశారు. కేసు వివరాలను డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ గురువారం వెల్లడించారు. నూజివీడుకు చెందిన గరికే కోటయ్య (26)కు గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన పిడపర్తి హైమావతికి ఫోన్ ద్వారా నాలుగేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. దీంతో అప్పటికే వివాహమైన హైమావతి తన భర్త అయిన జోజిబాబును వదిలేసి ముగ్గురు పిల్లలతో కలిసి నూజివీడు వచ్చి ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఉంటూ కోటయ్యతో సహజీవనం చేస్తోంది. గత మూడు నెలలుగా కోటయ్య తల్లికి ఆరోగ్యం బాగోకపోవడంతో ఆమెకు సేవలు చేయమని చెప్పినా హైమావతికి ఇష్టం లేక తన పిల్లలతో కలిసి విజయవాడ వెళ్లింది. అయితే రెండు రోజుల తరువాత కోటయ్య విజయవాడ వెళ్లి హైమావతిని మళ్లీ ఇంటికి తీసుకువచ్చాడు. గత నెల 27న కోటయ్య తల్లి మరణించగా, 30న హైమావతి తన పిల్లలతో వెళ్లిపోవడానికి ప్రయత్నించగా కోటయ్య నిలువరించాడు. అదే రోజు అర్ధరాత్రి ఆమెపై కోపంతో, అనుమానంతో లావుపాటి వేపకర్రతో తలపై, చేతులపై, కాళ్లపై విచక్షణారహితంగా కొట్టి హైమావతిని హత్య చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి గురువారం ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిపై నేరచరిత్ర ఉందని, 2016లో డీసీ షీట్ కూడా తెరవడం జరిగిందని డీఎస్పీ చెప్పారు. అంతేగాకుండా నందిగామ, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, మైలవరం పోలీస్‌స్టేషన్‌లలో కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడిని త్వరితగతిన పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఎస్సై–1 కే శివనారాయణ పాల్గొన్నారు.

నవ వధువుపై హత్యాయత్నం

తాడేపల్లి రూరల్: పట్టణంలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద గురువారం రాత్రి కొత్తగా వివాహమైన ఓ యువకుడు తన భార్యను నీళ్లలో ముంచి చంపే ప్రయత్నం చేయగా మత్స్యకారులు గమనించడంతో ఆ యువతి ప్రాణాలతో బయటపడింది. ఆ యువకుడిని మత్స్యకారులు పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరానికి చెందిన నాయుడు బాలాజీకి, మరదలు లక్ష్మీ దుర్గకు మూడు నెలల కిందట వివాహమైంది. విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చిన దంపతులు దర్శనం అనంతరం తాడేపల్లిలోని పుష్కర ఘాట్‌కు వచ్చారు. నీళ్లలోకి దిగుదామని భార్యతో చెప్పి ఆమెను అందులో ముంచే ప్రయత్నం చేశాడు. దీంతో లక్ష్మీ కేకలు వేయడంతో చేపల వేటకు వచ్చిన వారు లక్ష్మీని రక్షించి పోలీసులకు అప్పజెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తంటికొండకు చెందిన గాడి దొరబాబు లారీ క్లీనర్, కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహమై ఇద్దరు సంతానం ఉన్నారు. ఆరు నెలల క్రితం దొరబాబుకు ఇన్‌స్టాలో జంగారెడ్డిగూడెంకు చెందిన మహిళతో పరిచయమైంది. మే 25న ఆమెను కలవడానికి జంగారెడ్డిగూడెం రాగా, అతనితో మాట్లాడడానికి నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై కలుపు మందు తాగి, ఫోన్ ద్వారా విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. వారు దొరబాబును స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ తరలించారు. చికిత్స పొందుతూ మే 31 రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

క్షయ నివారణలో 'ఏలూరు'కు స్వర్ణం

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



డీఎంహెచ్‌ఓ డి.ఆశ, టీబీ కంట్రోల్ అధికారి రత్నకుమారిలకు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): క్షయ నివారణ దిశగా ఏలూరు జిల్లా పురోగతి సాధించినందుకు గాను జిల్లాకు జాతీయ స్థాయిలో బంగారు పతకం పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. క్షయ నియంత్రణలో ఏలూరు జిల్లాకు బంగారు పతకం పొందిన సందర్భంగా గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.ఆశ, అదనపు డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి జి.రత్నకుమారిలకు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని, కలెక్టర్ అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సమాజంలో క్షయ విస్తరించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇందుకు వైద్యశాఖ కృషి ఒక్కటే సరిపోదని స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సంయుక్తంగా పోరాడినప్పుడే 2025 నాటికి ఈ వ్యాధిని ప్రణాళిక ప్రకారం అంతం చేయవచ్చన్నారు. ప్రపంచ క్షయ నివారణ సదస్సులో ప్రధాని మోదీ చేతుల మీదుగా పురస్కారాలు అందిన వాటిలో ఆంధ్రప్రదేశ్ ఒకటని, వీటిలో ఏలూరు జిల్లాకు స్వర్ణం రావడం ఆనందదాయకమన్నారు. 2015–22 మధ్య క్షయ నివారణ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం పనితీరుకు ఈ పురస్కారం దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ జి.రఘు, డీపీఎస్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న చీకటమిల్లి మంగరాజు

పాలకొల్లు అర్బన్: పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు జోస్యం చెప్పారు. పాలకొల్లులో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేదలకు సెంటు భూమి కూడా పంచలేదన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో 33 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలిస్తే చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. పేదలకిస్తున్న సెంటు భూమిని సమాధులతో పోల్చడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంద కృష్ణ మాట వినే పరిస్థితుల్లో మాదిగలు లేరన్నారు. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మంగరాజు ధ్వజమెత్తారు. ఆయన వెంట మాలమహానాడు రాష్ట్ర నాయకులు బొందా మోహన్‌రావు, కోట రత్నంరాజు, శ్రీను, సందీప్ ఉన్నారు.

బాణసంచా గోడౌన్ల భద్రతలో లోపాలుంటే చర్యలు



పల్లెర్లమూడిలో బాణసంచా గోడౌన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్

నూజివీడు: పట్టణం, మండలంలో ఉన్న బాణసంచా గోడౌన్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో లైసెన్స్‌దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలంలోని పల్లెర్లమూడి, అన్నవరంలలో ఉన్న బాణసంచా గోడౌన్‌లను గురువారం డీఎస్పీ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆర్.అంకబాబు, ఎస్సై తలారి రామకృష్ణ తనిఖీ చేశారు. నీటి సదుపాయం, కార్బన్‌డైఆక్సైడ్ సిలిండర్లు, ఇసుక సిద్ధంగా ఉందా లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తోందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. బాణసంచా అనుమతించిన మేరకే నిల్వ చేయాలని, అంతకంటే ఎక్కువ మొత్తంలో నిల్వ చేస్తే చర్యలు తప్పవన్నారు. గోడౌన్‌లు ఊరికి దూరంగా ఉండాలని, నివాస ప్రాంతాల్లో ఉండటానికి వీల్లేదన్నారు. లైసెన్స్‌లను, ఇతర ధ్రువపత్రాలను డీఎస్పీ పరిశీలించారు.

బైనేరు వాగులోకి కారు బోల్తా

- వ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం
- బంధువుల పెళ్లికి వెళుతుండగా ప్రమాదం





బైనేరు వాగులో పడి నుజ్జయిన కారు, (అంతరచిత్రం) సూర్యనారాయణమూర్తి మృతదేహం

జంగారెడ్డిగూడెం: బంధువులు పెళ్లికి హాజరయ్యేందుకు వెళుతూ కారు అదుపుతప్పి బైనేరు వాగులోకి పడిపోవడంతో జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ వ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న తోకల హరి సూర్యనారాయణమూర్తి (39) పేరంపేట రోడ్డులో వ్యవసాయ పరికరాలను విక్రయించే షాపు నిర్వహిస్తున్నాడు. కొయ్యలగూడెంలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు తన కారును డ్రైవ్ చేసుకుంటూ గురువారం ఉదయం బయలుదేరాడు. బైనేరు వంతెన సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి వంతెన పైనుంచి కారు వాగులోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జవడంతో అందులో ఇరుక్కున్న సూర్యనారాయణమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు కామవరపుకోటకు చెందిన తోకల రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి లైన్‌మేన్ మృతి



ధర్మరాజు (ఫైల్)

కొయ్యలగూడెం: విద్యుదాఘాతానికి గురై ఓ లైన్‌మేన్ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాజవరం సచివాలయ పరిధిలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లా బత్తుల ధర్మరాజు (37) రాజవరం ఫీడర్ పరిధిలో ఎల్సీ తీసుకుని మరమ్మతులు చేయడానికి స్తంభం ఎక్కాడు. ఆ సమయంలో పక్కనే పంగిడిగూడెం ఫీడర్ చెందిన జంపర్ వైర్లు తగలడంతో ధర్మరాజు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతనిని జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు మాజీ సర్పంచ్ పాములు నాగమునిస్వామి తెలిపారు. మృతుడు గతంలో దిప్పకాయలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు

ఏలూరు టౌన్: భీమడోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడటంతో ఒక గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. దెందులూరు–భీమడోలు రైల్వేస్టేషన్ మధ్య గురువారం ఏలూరు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లిన గుర్తు తెలియని రైలు నుంచి సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి జారిపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతనిని వెంటనే 108 వాహనంలో ఏలూరు జీజీహెచ్‌కు తరలించి ఎమర్జెన్సీ మెడికల్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. స్పృహ కోల్పోయి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడని రైల్వే ఎస్ఐ డీ.నరసింహారావు చెప్పారు. ఇతర వివరాలకు 94406 27572 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

కొండలరాయుడుస్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

అత్తిలి: స్థానిక గంటావారిపుంతలో కొలువై ఉన్న కొండలరాయుడు స్వామి 15వ వార్షికోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభయ్యాయి. ఉదయం స్వామివారికి కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. ఈనెల 5వ తేదీ వరకు స్వామివారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని ఆలయ గురువు గొట్టుముక్కల సత్యనారాయణరాజు తెలిపారు. ముఖద్వారం నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈనెల 5వ తేదీన అఖండ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా కొండాలమ్మవారి జాతర మహోత్సవం

అత్తిలి: బల్లిపాడు రోడ్డులో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారి 7వ జాతర మహోత్సవం గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు బిందెలతో జలాన్ని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి మంగళస్నానం చేయించారు. డప్పువాయిద్యాలు, ఆసాదుల గరగనృత్యాలు, భేతాళ శక్తి వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

దర్శిపర్రులో అన్నసమారాధన

పెంటపాడు: హనుమాన్ జయంతి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకొని దర్శిపర్రు పుంతలో ములసమ్మ ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కిరాలపాడు, బిల్లగుంట, బోడపాడు, గ్రామాల నుండి మూడు వేలమందికి పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మలేరియా పై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం అందరిపైనా ఉందని అర్బన్ హెల్త్ వైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగ భూషణం అన్నారు. తణుకు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలులేకుండా చూసుకోవాలనారు. దోమ తెరలు వాడడంవంటి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది, సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ఎండల వేళ.. కొండెక్కిన ఫలాలు

- సామాన్యుడికి అందనంత ఎత్తులో ధరలు
- అధిక ఎండలు, జ్యూస్ సెంటర్ల వినియోగమే కారణం


మార్కెట్‌లో పండ్లు

పెంటపాడు: భానుడు నడినెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. వడగాల్పులు, ఉక్కపోతకు జనం అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకొంటున్న తరుణంలో నిస్సత్తువ ఆవరించకుండా పోషక విలువలు కలిసిన తాజా పండ్లు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. కానీ మార్కెట్‌లో పళ్లు కొనాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో ఆపిల్, దానిమ్మ, పైనాపిల్, కమలా, ద్రాక్ష, బొప్పాయి, అరటి, మామిడి, సపోటా.... తదితర పళ్లు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్నాయి. వాటి ధరలు చూస్తే సెగలు పుడుతున్నాయి. ఏ రకమైన పండు కొనాలన్నా, వందల్లో రేట్లు పలుకుతున్నాయి.

పెరిగిన వినియోగం:
వ్యక్తిగత ఆరోగ్యం కోసం, పూజా కార్యక్రమాలకు, రోగులను పరామర్శించే సమయం, బంధువుల ఇంటికి వెళ్లే సమయంలో సాధారణంగా పళ్లు కొనుగోలు చేస్తుంటాం. పోషక విలువలు ఉన్న పళ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని వైద్యులు చెబుతుంటారు. పైగా కరోనా తరువాత వీటి వినియోగం బాగా పెరిగింది. వేసవిని సాకుగా చూపి, దిగుమతి లేదని, గిరాకీ అని చెప్పి వ్యాపారులు రేట్లు అమాంతం పెంచుతున్నారని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. పెంటపాడు మండలంలో పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పండ్ల వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పరిమాణాన్ని బట్టి డజను ఆపిల్ రూ. 400 నుంచి 500 ఉన్నాయి. అరడజను దానిమ్మకాయలు రూ. 250 ఉన్నాయి. డజను చక్కెరకేళీ రూ. రూ. 100, నల్లద్రాక్ష కేజీ రూ. 130, పుచ్చకాయ కేజీ రూ.35, బొప్పాయి కేజీ రూ. 50, డ్రాగన్ ఫ్రూట్ ఒక్కటి రూ.100, విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేక వినియోగదారుడు పెదవి విరుస్తున్నాడు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్ల వినియోగం పెరిగి వాటిరేట్లు కూడా అమాంతం పెంచేశారు.

సామాన్యులకు అందుబాటులో లేవు



ప్రస్తుతం పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. వేసవిలో సీజన్‌లో దొరికే పళ్లు అయిన పుచ్చకాయ, సపోటా బొప్పాయి, తదితర పళ్ల ధరలు పెరిగిపోయాయి. వేసవిలో పళ్లు కొనుగోలు చేసే కన్నా జ్యూస్ సెంటర్ మేలని జనం ఎక్కువగా గుమిగూడుతున్నారు. అక్కడ కూడా రేట్లు అమాంతం పెంచేశారు.

– డి. రాంబాబు, కొండేపాడు, పెంటపాడు మండలం

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఉపాధి పని కల్పించాలని కోరుతూ అలంపురంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కూలీలు

పెంటపాడు: ఉపాధిహామీ పథకం పని ప్రాంతంలో మంచినీరు, టెంట్లు, పనిముట్లు, ప్రథమ చికిత్స కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం అలంపురం గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంపై కేంద్రం మీనవేషాలు లెక్కించడం సమంజసం కాదన్నారు. పని కావాలని కొరుకున్న ప్రతి వ్యక్తికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఉపాధి రంగం కూలీలకు కీలకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, ఆకుల రామారావు, కె. అనంతలక్ష్మి, నరసమ్మ, వరలక్ష్మీదేవి, సుబ్బారావు, దుర్గాభవాని, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అక్షర జ్ఞానంతో బంగారు భవితకు బాట


తాడేపల్లిగూడెం : గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు


తణుకు : విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అక్షరజ్ఞానంతో విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేసుకోవాలని గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు 24వ రోజు జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ప్రత్తి వీరాస్వామిచే నీతి కథలు, గ్రంథాలయంలోని పుస్తకాలను చదివించారు. అనంతపల్లి జనార్ధనరావుచే పుస్తక సమీక్ష, విశ్రాంత ఎంఈఓ సాల్మన్‌రాజు, తెలుగు ఉపాధ్యాయులు మహాభట్టు లక్ష్మణరాజుచే తెలుగు, స్పోకెన్ ఇంగ్లీషు, సైన్స్ తదితర అంశాలను నేర్పించారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు రిసోర్సు పర్సన్ పీ త్రిపుర సుందరి ఆధ్వర్యంలో అబాకస్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చేతి రాత పోటీలు నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రీసోర్సు పర్సన్ జీ అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు చదరంగం ఆటలో శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు


సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

తణుకు: తమ బుడి బుడి అడుగుల సవ్వడితో అలరించారు. సంగీతానికి అనుగుణంగా పాదాలు కలుపుతూ ఆకట్టుకున్నారు...శిక్షణ ప్రారంభించి కనీసం నెల రోజులు కాకుండానే వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ ఔరా అనిపించారు. తణుకు పట్టణానికి చెందిన శ్రీ పద్మజ నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరంలో భాగంగా గురువారం రాత్రి ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

అనాథ వృద్ధునికి మానవత సేవలు

పెంటపాడు: ఒక గుర్తు తెలియని వృద్ధుని పట్ల మానవత సంస్థ తక్షణం స్పందించింది. వివరాల్లోకి వెళ్లితే ... గత నాలుగు రోజుల నుంచి ఒక గుర్తు తెలియని వృద్ధుడు పెంటపాడు ఎస్టీవీఎస్‌స్కూలు చెట్లకింద అచేతంగా పడి ఉన్నాడు. కొందరు స్పందించి ఆహారాన్ని అందించినా తినలేదు. ఈ విషయాన్ని స్థానికులు మానవత సంస్థకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు మోహనరావు ఆ వృద్ధుని ఆదుకొనేందుకు తక్షణం మానవత వాహనాన్ని సమకూర్చి సొంత ఖర్చులతో ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. పలువురు మోహనరావును ప్రత్యేకంగా అభినందించారు.

చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


చెరువులోని చెత్తా చెదారాలను తొలగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లోని చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే.మల్లిఖార్జునరావు అన్నారు. గురువారం మండలంలోని దండగర్ర పంచాయతీ పరిధి లింగారాయడిగూడెంలో 7.62 ఎకరాల విస్తీర్ణంలోని బోంద్రుగుంట చెరువు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీపీవో మల్లిఖార్జునరావు మాట్లాడుతూ మంచినీటి వనరులను అభివృద్ధిలో భాగంగా అమృత్ సరోవర్‌లో చెరువులను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఈ చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తా చెదారాలను చెరువుల వద్ద వేయకుండా గ్రామాల్లో ఇంటింటికి వచ్చే పారిశుద్య కార్మికులకు అందజేయాలన్నారు. తద్వారా గ్రామ పారిశుద్యానికి ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీపీ పానుకు మాటి శేషులత మాట్లాడుతూ అపారిశుద్యం వల్ల మంచినీటి వనరులు కలుషితంగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీ ఎం.లక్ష్మి, ఈవోఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ ఈవో సీహెచ్.శ్రీనివాస చంద్రరాజు, పంచాయతీ కార్యదర్శులు ఫణికుమార్, బి.పవన్‌కుమార్, అంకం శ్రీరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు యాతం సత్యనారాయణ (పెద్దోడు), ఆర్‌బీకే చైర్మన్ ములగాల గంగారావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

పెంటపాడు: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారంతో స్వయంశక్తితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని త్రిపుల్‌ఎఫ్ కర్మాగార డైరెక్టర్ ఓం ప్రకాష్ గోయంకా పేర్కొన్నారు. ప్రత్తిపాడు త్రిపుల్ కర్మాగారం ఆధ్వర్యంలో స్వాభిమాన్ పౌండేషన్ ద్వారా గురువారం మహిళలకు కట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కర్మాగారం ద్వారా ఉపాధితో పాటు, సామాజిక సేవాకార్యక్రమాల్లో భాగంగా కుట్టు శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి 60 రోజుల శిక్షణ దిగ్విజయంగా పూర్తి చేసుకొని మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ఎ. కృష్ణారెడ్డి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు జి. ప్రవీణ్, కిషోర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పేదలకు నేరుగా ప్రభుత్వ పథకాలు


తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట సచివాలయం వద్ద వలంటీర్లను సన్మానించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పేదలకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందని ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, అప్పారావుపేట సర్పంచ్ ఆరుగొలను శ్రీను అన్నారు. గురువారం మండలంలోని అప్పారావుపేట సచివాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం ఏటా పురస్కారాలను అందిస్తుందన్నారు. అనంతరం వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపాలెం సర్పంచ్ ఎలిషే గాంధీ, పంచాయతీ కార్యదర్శి వివి.నరసింహరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిబాబు, మాదేపల్లి సూర్యనారాయణ, రాపాక వెంకటేశ్వరరావు, వై.వెంకటరత్నం, రామకృష్ణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం


యాగర్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నిర్మూలన, పరిసరాలు పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గురువారం వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అమృత అధ్యక్షతన యాగర్లపల్లిలో మలేరియా నివారణ మాసోత్సవాల అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30 వరకు మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధి, లక్షణాలు, నివారణ చర్యలు, వైద్యం, తదితర విషయాలను చర్చించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్స్‌లో పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలి పారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలని, ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి తొట్టెలు ప్రతి వారం ఒకసారి శుభ్రం చేసుకోవాలని తదితర విషయాలను చర్చించారు. ఇండ్ల గోడలపై డీడీటీ, మాలథియాన్, సింథటిక్ పైరిత్రాయిడ్ దోమల మందులను స్ప్రే చేయాలని సూచించారు. రిథమ్ ఫాగింగ్ ద్వారా దోమలను నిర్మూలించవచ్చునని తెలిపారు. ఆరోగ్య సహాయకులు కాంతారావు, కార్యదర్శులు, టెక్నీషియన్స్ ఆశాలు, పర్యవేక్షకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గూడెం మునిసిపల్ కమిషనర్‌గా శామ్యూల్

తాడేపల్లిగూడెం: గూడెం మునిసిపల్ కమిషనర్‌గా వెటర్నరీ అసిస్టెంటు సర్జన్ ఏ.శామ్యూల్ ను నియమిస్తూ మునిసిపల్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తెనాలి మునిసిపాలిటీలో గ్రేడ్ త్రీ ఉద్యోగిగా పనిచేస్తున్న గోపాలరావును గూడెం మునిసిపాలిటీ అసిస్టెంటు కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. శామ్యూల్ పశుసంవర్థకశాఖలో అసిస్టెంటు సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఆయనను డిప్యూటేషన్ ప్రాతిపదికన ఒక ఏడాదిపాటు గూడెంలో పనిచేసే విధంగా ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆయన మాతృసంస్థ వెటర్నరీ శాఖ నుంచి అనుమతి అధికారిక పత్రం వచ్చిన తర్వాత మాత్రమే ఆయన కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోవాల్సి ఉందని సమాచారం. గూడెం పట్టణానికి చెందిన ఆయన గతంలో గుడివాడ కమిషనర్‌గా కూడా పనిచేశారు. కాలం ముగిసిన గత కౌన్సిల్ హయాంలో ఇక్కడ ఆయన కమిషనర్‌గా పనిచేయడానికి ఉత్వర్వులు తెచ్చుకున్నప్పటికి అవి ఒకరోజు మాత్రమే మనుగడలో ఉన్నాయి. దీంతో ఆయన ఇక్కడ కొనసాగలేక పోయారు. ఆయన ఇక్కడ కమిషనర్‌గా పనిచేయాలన్న కోరిక, చేసిన కృషి ఫలించి ఉత్తర్వులు వచ్చాయి. మాతృ సంస్థ నుంచి కన్సెంట్ తెచ్చుకున్న వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కేంద్ర రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందని, తక్షణమే ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని మెట్ట ఉప్పరగూడెంలో గురువారం మాల మహానాడు సమావేశం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలన్నారు. కేంద్రం సైతం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు యేసురత్నం, సునీల్, ప్రభుదాస్, రాంబాబు, సత్తిబాబు, శ్రీనులు పాల్గొన్నారు.

భూషణ్ శరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి


మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళా రెజ్లర్లకు న్యాయం చేసేందుకు బీజేపీ మంత్రి భూషణ్ శరణ్ సింగ్ పై వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న, ఒలింపిక్ విజేతలు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద న్యాయం చేయాలని కోరుతున్న మహిళా రెజ్లర్లకు సంఘీభావం తెలిపేందుకు కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా సీఐటీయు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీనులు మాట్లాడుతూ క్రీడాకారుల ఛాతిపై మెరిసే పతకాలు దేశానికి గర్వకారణమన్నారు. మన దేశ గౌరవం ప్రపంచ నలుమూలల వ్యాపించేందుకు క్రీడాకారుల పట్టుదల, కృషి వల్లనే సాధ్యం అన్నారు. తక్షణమే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలన్నారు. రెజ్లర్లుకు న్యాయం జరగకపోతే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. నరమాల కృష్ణ, అగుర్తుల రామ్మోహన్‌రావు, కె.శివాజీ, యడవల్లి వెంకన్న, పతివాడ నాగేంద్రబాబు, గొర్రెల వంశీ, శ్రీను పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

తణుకు టౌన్: భవన నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యర్ర మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. గురువారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులందరూ సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరి ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా అందిస్తున్న గుర్తింపు కార్డులను పొందాలని తెలిపారు. ఈసమావేశంలో వాటాల నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, డీ ముకేంద్రరావు, కె వెంకటేశ్వరరావు, నక్క సత్యనారాయణ, ఏకే బసవయ్య, వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షల శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారిచే ఈ నెల 2వ తేదీన శుక్రవారం ఉదయం 7 గంటలకు 10 గంటల వరకు ఉచిత షుగర్ వ్యాధి రక్త పరీక్షా శిబిరం పట్టణంలోని కడకట్ల జనతా ట్రస్ట్‌లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణమూర్తి తెలిపారు. పరగడుపున ఒక్కసారి, తదుపరి ఆహారం తిన్న అనంతరం రెండోసారి పరీక్షలు జరుగుతాయని, రిపోర్టు ఇవ్వడం, సూచనలు అందజేయడం జరుగుతుందని, శిబిరంలో పాల్గొని రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు.